నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
26 మార్చి 2025
పేజీలు 8

## విద్యుత్ పంపిణీ సంస్థకు ర్యాంక్

డిస్ట్రిబ్యూషన్ యుటిలిటీస్ ర్యాంకింగ్ (డీయూఆర్)- 2023-24 నివేదికను కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ మార్చి 20న విడుదల చేసింది. దీనిలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు గుర్తింపు లభించింది. కన్జ్యూమర్ సర్వీస్ రేటింగ్ ఆఫ్ డిస్కంలో రాష్ట్రానికి మూడో ర్యాంక్ దక్కింది. ఈ విభాగంలో మొత్తం 41 విద్యుత్ పంపిణీ సంస్థలకు ర్యాంకులు కేటాయించారు. వినియోగదారుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం, 99 శాతం వరకు ఆన్‌లైన్ ద్వారా సర్వీసులను అందించడం చేస్తుంది.

# అంతర్జాతీయం

### వైట్ హైడ్రోజన్

- పర్యావరణహిత వైట్ హైడ్రోజన్ 92 ట్రిలియన్ డాలర్ల విలువ గల 46 మిలియన్ టన్నుల భారీ నిల్వలు ఫ్రాన్స్‌లోని మోసెల్లె ప్రాంతంలో కనుగొన్నారు. జర్మనీలోని హెల్మ్‌హోల్ట్జ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ శాస్త్రవేత్తల మార్చి 18న వెల్లడించిన ప్రకారం నేచురల్ (సహజ) లేదా జియోలాజిక్ హైడ్రోజన్‌గా పిలిచే ఇది పర్వత ప్రాంతాల్లోని భూమి లోపలి పొరల్లో ఉండే అవకాశముంది. దీన్నిబట్టి ప్రధానంగా పైరినీస్, యూరోపియన్ ఆల్ప్స్, హిమాలయ శ్రేణుల్లో వీటి నిల్వలు ఉండవచ్చని భావిస్తున్నారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడంలో వైట్ హైడ్రోజన్ కీలకపాత్ర పోషిస్తుంది. 1987లో ఆఫ్రికాలోని మాలిలో వైట్ హైడ్రోజన్‌ను మొదటిసారి కనుగొన్నారు. దీన్ని స్థానిక గ్రామానికి కావాల్సిన విద్యుత్తును అందిస్తున్నారు.



### సీబీపీ హోం యాప్

- చట్టవ్యతిరేకంగా అమెరికాలో ఉంటున్నవారు దేశం నుంచి స్వీయ బహిష్కరణ చేసుకునేందుకు వీలుగా సీబీపీ హోం యాప్‌ను అమెరికా మార్చి 10న ఆవిష్కరించింది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. అక్రమ వలసదారులు ఆ యాప్‌ను వినియోగించుకొని దేశాన్ని వీడాలని సూచించారు. లేకపోతే బలవంతంగా పంపిస్తామని, శాశ్వతంగా అమెరికాలో అడుగుపెట్టకుండా చేస్తామని హెచ్చరించారు. స్వచ్ఛందంగా వెళ్లిపోయినవారికి భవిష్యత్తులో చట్టబద్ధంగా మళ్లీ అమెరికాకు వచ్చే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. భారత విద్యార్థి




రంజనీ శ్రీనివాసన్ ఈ యాప్‌ను ఉపయోగించి అమెరికాను వీడిన సంగతి తెలిసిందే. కొలంబియా యూనివర్సిటీలో నిరసన తెలిపిన పాలస్తీనాకు మద్దతుగా తెలిపిన రంజనీ వీసాను అమెరికా రద్దు చేయడంతో ఆమె స్వీయ బహిష్కరణ చేసుకుంది.

### బాదర్ ఖాన్‌ను బహిష్కరించొద్దు

- హమాస్‌తో సంబంధాల ఆరోపణలతో అరెస్ట్ అయిన భారతీయ విద్యార్థి బాదర్ ఖాన్ సురి బహిష్కరణను అమెరికా న్యాయస్థానం మార్చి 20న నిలిపివేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు అతడి బహిష్కరణకు వీల్లేదని వర్జీనియా కోర్టు తీర్పు వెలువరించింది. వాషింగ్టన్ డీసీలోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్‌గా ఉన్న బాదర్ ఖాన్ సురి విశ్వవిద్యాలయంలో హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నాడని డిపార్ట్‌మెట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) అధికారులు ఆరోపించారు.

### వరుణ 2025

- భారతదేశం-ఫ్రాన్స్ ద్వైపాక్షిక నావికాదళ విన్యాసాలు వరుణ మార్చి 19 నుంచి 22 వరకు అరేబియన్ సముద్రంలో నిర్వహించారు. ఈ విన్యాసాల్లో ఇరుదేశాల విమాన వాహక నౌకలు విక్రాంత్, చార్లెస్ డి గాలె, యుద్ధ విమానాలు, డిస్ట్రాయర్లు, ఫ్రిగేట్‌లు, స్కార్పీన్ క్లాస్ జలాంతర్గామితో పాటు రెండు నావికాదళాలు పాల్గొన్నాయి. ఈ విన్యాసాలు 1993లో ప్రారంభమయ్యాయి. ఈ విన్యాసాలకు 2001లో వరుణ అని నామకరణం చేశారు.

### తొలి ఏఐ న్యూస్ పేపర్

- ప్రపంచంలో మొట్టమొదటి కృత్రిమ మేధ (ఏఐ) వార్తాపత్రికను ఇటాలియన్ వార్తా సంస్థ ఎల్ ఫాగియో మార్చి 18న ప్రచురించింది. ఏఐ టెక్నాలజీ ప్రభావం జర్నలిస్టులు, పత్రికల పనితీరుపై ఏ విధంగా ఉంటుందో తెలుసుకునేందుకు నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా ఏఐ టెక్నాలజీని ఉపయోగించి దినపత్రికను రూపొందించింది. ఏఐతో రూపొందించిన నాలుగు పేజీల ఎడిషన్ మార్కెట్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా విడుదలైంది. పత్రికా పరిశ్రమలో ఏఐని ఏ విధంగా ఉపయోగించాలని ప్రపంచ వ్యాప్తంగా వార్తా సంస్థలు ఆలోచిస్తున్న సమయంలో ఇటాలియన్ వార్తాపత్రిక ఈ ప్రయోగం చేసింది.


IL FOGLIO Ai
Segnali di ripresa
La Giornata

# జాతీయం

### శిష్టాచార్ స్క్వాడ్

- దేశ రాజధాని ఢిల్లీలో మహిళలకు బహిరంగ ప్రదేశాల్లో మరింత రక్షణ కల్పించేందుకు ఢిల్లీ ప్రభుత్వం శిష్టాచార్ స్క్వాడ్ పేరిట యాంటీ ఈవ్‌టీజింగ్ స్క్వాడ్ ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు మార్చి 17న వెల్లడించారు. ఢిల్లీలోని ప్రతి జిల్లాలో రెండు శిష్టాచార్ స్క్వాడ్‌లు విధులు నిర్వహిస్తుంటాయి. ఈ స్క్వాడ్'లో ఒక ఇన్‌స్పెక్టర్, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఎనిమిదిమంది కానిస్టేబుళ్లు, ఒక హెడ్ కానిస్టేబుల్ ఉంటారు. వీరిలో నలుగురు మహిళా సిబ్బందితో పాటు ఒక సాంకేతిక నిపుణులు ఉంటారు. దీన్ని 2017లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటీ రోమియో స్క్వాడ్ నుంచి ప్రేరణ పొంది ఢిల్లీ ప్రభుత్వం ఈ శిష్టాచార్ స్క్వాడ్‌కు శ్రీకారం చుట్టింది.



### డీఏసీ సమావేశం

- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మార్చి 20న రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) సమావేశం నిర్వహించారు. రూ.



54,000 కోట్ల విలువైన సైనిక ఆధునికీకరణ ప్రాజెక్టులకు డీఏసీ ప్రాథమిక ఆమోదం తెలిపింది. ఇందులో టీ-90 ట్యాంకుల ఆధునికీకరణతో పాటు గగనతల ముందస్తు హెచ్చరికల వ్యవస్థల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. దేశీయంగా అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్ (అటాగ్స్) యుద్ధ ట్యాంకులను సైన్యంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రూ. 7,000 కోట్ల ఒప్పందానికి ఆమోదం తెలిపింది. మొత్తం 307 యుద్ధ ట్యాంకులను కొనుగోలు చేయనుంది. దీంతో పాటు 327 గన్ టోయింగ్ వాహనాలను కూడా కొనుగోలు చేయనున్నారు.

### పానీటెంగాలో బ్యాక్టీరియా

- అసోం సంప్రదాయ వంటకం పానీటెంగాలో మానవులతో పాటు పరిశ్రమలకు పనికొచ్చే బ్యాక్టీరియా బాసిల్లస్ సబ్టిలిస్ ఎస్ఎంపీ-2 ను కనుగొన్నట్లు ఐఐటీ గువాహటి శాస్త్రవేత్తలు మార్చి 19 వెల్లడించారు. పానీ టెంగాలో కనుగొన్న ఈ బ్యాక్టీరియాకు బయో సర్ఫేక్టెంట్స్ అనే సేంద్రియ రసాయనాలను ఉత్పన్నం చేసే శక్తి ఉంది. మామూలుగా ఒకదానితో ఒకటి కలవని నూనె, నీరు వంటి పదార్థాలను మేళవించడానికి బయో సర్ఫేక్టెంట్స్ తోడ్పడతాయి. ప్రస్తుతం జిడ్డును తొలగించడానికి తోడ్పడే రసాయనిక బయో సర్ఫేక్టెంట్స్‌ను సబ్బులు, షాంపూలు, డిటర్జెంట్లలో వాడుతున్నారు. వీరి పరిశోధనవల్ల సేంద్రియ బయో సర్ఫేక్టెంట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఇవి సముద్రాల్లో, నేల మీద నూనె చారలను తొలగించడానికి, భూగర్భం నుంచి చమురును తవ్వి తీయడానికి, సౌందర్య ఉపకరణాల్లో, కొన్ని రకాల మందుల తయారీకీ ఉపకరిస్తాయి. మ్యాంగోస్టీన్, చింతపండు, నిమ్మరసంలో ఆవ గింజలను పులియబెట్టి ఉప్పు, పచ్చి



మిర్చి వేసి ఆ ముద్దను అరిటాకులో పెట్టి వెదురు బొంగుల్లో ఒకటి రెండు వారాలు ఉంచితే పచ్చడి లాంటి పానీటెంగా తయారవుతుంది. అసోం ప్రజలు ఈ పచ్చడిని అన్నంతో కలిపి తింటారు.

### పాడి పరిశ్రమ

- ప్రధాని అధ్యక్షతన మార్చి 19న సమావేశమైన కేంద్ర మంత్రివర్గం సవరించిన



జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి కార్యక్రమం (నేషనల్ ప్రోగ్రాం ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్-ఎన్‌పీడీడీ) ఆమోదం పొందింది. కేంద్ర ప్రాయోజిత పథకంగా జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి కార్యక్రమానికి అదనంగా రూ. 1000 కోట్లు కేటాయించారు. దీంతో 15వ ఆర్థిక సంఘం కాలానికి (2021-22 నుంచి 2025-26) మొత్తం బడ్జెట్ రూ. 2790 కోట్లకు చేరుకుంది.

### భీమ్-యూపీఐ

- చిన్న వ్యాపారులను డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సహించేందుకు కేంద్రం రూ. 1,500 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని 2024-25కు మార్చి 19న ఆమోదించింది. తక్కువ విలువతో కూడిన యూపీఐ లావాదేవీలకు (వ్యక్తి నుంచి వ్యాపారికి) ఈ స్కీం కింద ఆర్థిక ప్రోత్సాహక పథకాన్ని క్యాబినెట్ నిర్ణయించింది. ఈ స్కీం 2026 వరకు కొనసాగుతుంది. 2024, ఏప్రిల్ 1 నుంచి 2025, మార్చి 31 వరకు ఈ ప్రోత్సాహకం చెల్లించేందుకు కేబినెట్ నిర్ణయించింది. ఈ పథకం రూ. 2000 లోపు ఉన్న యూపీఐ లావాదేవీలపై 0.15% ప్రోత్సాహకాన్ని అందజేస్తుంది.

# వార్తల్లో వ్యక్తులు

### సునీతా విలియమ్స్

- భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)ను వీడి మార్చి 19న భూమ్మీదకు చేరారు. ఆమెతో పాటు బుచ్ విల్మోర్, నిక్ హేగ్, అలెగ్జాండర్ గుర్బనోవ్ ఉన్నారు. సుమారు 9 నెలలు అంతరిక్షంలో ఉన్నారు. సునీతా విలియమ్స్ అమెరికాలోని ఒహియో రాష్ట్రంలో 1965, సెప్టెంబర్ 19న జన్మించారు. ఆమె తండ్రి దీపక్ పాండ్య గుజరాత్‌లోని జులాసన్ గ్రామానికి చెందినవారు. 62 గంటల 6 నిమిషాల పాటు అంతరిక్షంలో స్పేస్‌వాక్ చేసిన మహిళా వ్యోమగామిగా ఆమె ఘనత సాధించారు. ఎక్కువ సమయం స్పేస్ వాక్ చేసిన వారిలో మొత్తంగా సునీతా విలియమ్స్ నాలుగో స్థానంలో ఉన్నారు.



### క్రిస్టీ కోవెంట్రీ

- అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) అధ్యక్ష పదవికి ఒలింపిక్ మాజీ స్విమ్మర్ క్రిస్టీ కోవెంట్రీ మార్చి 20న ఎన్నికయ్యారు. 12 ఏండ్ల పాటు ఐవోసీ చీఫ్‌గా వ్యవహరించిన థామస్ బాచ్ స్థానంలో జూన్ 23న క్రిస్టీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈమె 2033 వరకు పదవిలో కొనసాగుతారు. 131 ఏళ్ల చరిత్రలో ఐవోసీ అధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టనున్న తొలి మహిళగా, ఆఫ్రికా జాతీయురాలిగా క్రిస్టీ చరిత్ర సృష్టించారు. జింబాబ్వేకు చెందిన క్రిస్టీ ఒలింపిక్స్‌లో స్విమ్మింగ్ విభాగంలో రెండుసార్లు గోల్డ్ మెడల్ సాధించారు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీని 1894 జూన్ 23న పియేర్ డి కౌబెర్టిన్, డెమెటియోస్ వికెలాస్ స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని లౌసాన్‌లో ఉంది.



# తేదీలు

### అటవీ దినోత్సవం

- ఏటా మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటంలో అడవుల ప్రాధాన్యతను, సంరక్షణపై అవగాహన కల్పించేందుకు, అడవుల నిర్వహణ, పరిరక్షణ, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఈ దినోత్సవాన్ని చేపడుతున్నారు. ఈ ఏడాది థీమ్ ఫారెస్ట్ అండ్ ఫుడ్ (అడవులు-ఆహారం). ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవంగా నిర్వహించాలని 1971 లో ప్రకటించింది. 2012 లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మార్చి 21ని అంతర్జాతీయ అటవీ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించగా 2013 నుంచి నిర్వహిస్తున్నారు.

### నౌరోజ్

- అదేవిధంగా మార్చి 21న పార్సీల నూతన సంవత్సరం నౌరోజ్‌ను జరుపుకొంటారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మార్చి 21న నౌరోజ్‌ను అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించింది. దీంతో పార్సీలు ఈ పండుగను జరుపుకొంటున్నారు. నవోజ్ లేదా నౌరోజ్ అంటే పర్షియన్ బాషలో 'నూతన ఆరంభం' అని అర్థం. దీనికి 3000 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇరానియన్ సోలార్ హిజీ క్యాలెండర్ (పర్షియన్ క్యాలెండర్) ప్రకారం వసంత విషువత్తు ఆధారంగా లేదా గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం మార్చి19, 21 తేదీల్లో నిర్వహించే ఈ పండుగతో వీరికి నూతన సంవత్సరం ఆరంభమవుతుంది.

### ఎర్త్ అవర్

- ఎర్త్ అవర్ మార్చి 22న నిర్వహించారు. దీనిలో భాగంగా రాత్రి 8:30 నుంచి 9:30 వరకు లైట్లు ఆపివేస్తారు. 2007లో ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఈ కార్యకమాన్ని మొదలుపెట్టారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ (వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్) అనే సంస్థ ఈ కార్యకమాన్ని నిర్వహిస్తుంది.

**మల్లవరపు బాలలత**
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ,
హైదరాబాద్

